తాగునీటి, విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి

- ప్రాథమిక గణిత సామర్థ్యాలు మెరుగుపర్చేందుకు ఏఐ పాఠాలు
- ఫిర్యాదుల పరిష్కారంలో వేగం పెంచాలి
- కలెక్టర్ విజయేందిరబోయి

పోలీసులైన్ స్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిరబోయి

ఫిర్యాదుదారుడుడితో మాట్లాడుతున్న పేట కలెక్టర్ సిక్తాపట్నాయక్

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మార్చి 17: వేసవిలో మంచి నీటి, విద్యుత్ సరఫరాపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ విజయేందిరబోయి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోలు, మండల ప్రత్యేకాధికారులు క్షేత్రస్థాయి పర్యటనల్లో ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. భూగర్భ జలాలు ఇంకిపోయి పంటలు ఎండిపోకుండా రైతులతో మాట్లాడి నీటి వృథాను అరికట్టడం తోపాటు పొదుపు, ప్రత్యామ్నాయ నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల్లో చదివే నైపుణ్యాలు పెంపొందించి ప్రాథమిక గణిత సామర్థ్యాలు మెరుగుపర్చడానికి ఏఐ సాఫ్ట్‌వేర్‌తో జిల్లావ్యాప్తంగా 53 ప్రాథమిక పాఠశాలల్లో నూతనంగా విద్యాబోధన చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజావాణిలో స్వీకరించిన అర్జీలు, వినతుల పరిష్కారంలో వేగం పెంచాలన్నారు. అంతకుముందు ప్రజావాణిలో వచ్చిన అర్జీలు 130 స్వీకరించి పరిష్కార చర్యలకు సంబంధిత అధికారులకు నివేదించారు. లోక్ భారతి ఎడ్యుకేషన్ సొసైటీ, ఆర్గనైజేషన్ లిమిటెడ్ సహకారంతో టీబీ వ్యాధి పీడితులకు నిక్షయ్ పోషణ్ కిట్లు అందజేశారు. కలెక్టరేట్‌లో నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం, అంబలి కేంద్రాన్ని ప్రారంభించారు. పోలీసు లైను పాఠశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ల్యాబ్‌ను 3వ తరగతి విద్యార్థిని వైశాలి చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేయించారు. జిల్లావ్యాప్తంగా 53 పాఠశాలల్లో ఈ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్లు శివేంద్రప్రతాప్, మోహన్‌రావు, ఆర్డీవో నవీన్, డీఆర్వో ప్రవీణ్‌కుమార్, ఏఎంవో శ్రీనివాస్, సీఎంవో బాలు యాదవ్, డీఎంహెచ్‌వో కృష్ణ, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నరేందర్, కార్యదర్శి రామకృష్ణ, రాజశేఖర్, అక్రమ్, చంద్రయ్య, తిరుపతమ్మ, కృష్ణ, రఘురామ్, మల్లేశ్, మహేశ్, శివ, మధు, విజయ, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను పెండింగ్‌లో పెట్టరాదు: పేట కలెక్టర్

నారాయణపేట టౌన్, మార్చి 17: ప్రజావాణిలో ప్రజలు అందించిన అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ పరిష్కరించాలని కలెక్టర్ సిక్తాపట్నాయక్ అధికారులకు ఆదేశించారు. సోమవారం పట్టణంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో 30 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదు దారులు తమ సమస్యలు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కలెక్టర్ వాటిని స్వీకరించి మాట్లాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, బేన్ షాలం, ఆర్డీవో రాంచందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కోర్టులో పరిష్కరించుకోవాలి: పేట ఎస్పీ

నారాయణపేట, మార్చి 17: ప్రజలు సివిల్ కేసులను కోర్టులో పరిష్కరించుకోవాలని ఎస్పీ యోగేశ్‌గౌతమ్ సూచించారు. సోమవారం పట్టణంలోని ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో 9 ఫిర్యాదులు వచ్చాయి. బాధితుల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులను చట్టప్రకారం పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత సీఐలు, ఎస్సైలకు ఫోన్‌లో ఆదేశించారు. భూ సమస్యలను కోర్టు, సామరస్యంగా మాట్లాడుకొని పరిష్కరించుకోవాలని, ఎలాంటి ఆవేశాలకు లోనుకారాదని తెలిపారు.

బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ యోగేశ్ గౌతమ్

నేరడుగంలో సామూహిక వివాహాలు ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే చిట్టెం

సామూహిక వివాహంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం

మాగనూరు మార్చి 17: నేరడుగం పశ్చిమాద్రి సంస్థాన విరక్త మఠంలో నిర్వహిస్తున్న సామూహిక వివాహాలలో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. సోమవారం మండలంలోని నేరడుగంలో పశ్చిమాద్రి సంస్థాన శ్రీ సిద్ధలింగ మహాస్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 14మంది జంటలకు ఉచిత సామూహిక వివాహాలను నిర్వహించారు. అనంతరం సాయంత్రం పశ్చిమాద్రి సంస్థాన విరక్త మఠంలో నిర్వహించిన రథోత్సవ కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో వివిధ మఠాల పీఠాధిపతులు, అఖిలపక్ష నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జనరల్ దవాఖానలో అరుదైన శస్త్రచికిత్సలు

- దవాఖాన సూపరింటెండెంట్ సంపత్ కుమార్‌సింగ్

మాట్లాడుతున్న సూపరింటెండెంట్ సంపత్‌కుమార్ సింగ్

మహబూబ్‌నగర్, మార్చి 17: ప్రభుత్వ జనరల్ దవాఖానలో అరుదైన శస్త్రచికిత్సలు విజయవంతంగా చేసినట్లు సూపరింటెండెంట్ సంపత్‌కుమార్ సింగ్ తెలిపారు. సోమవారం దవాఖానలోని తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జనరల్ దవాఖానలో రూ.లక్షలు విలువ చేసే శస్త్రచికిత్సలను ఉచితంగా ఆరోగ్యశ్రీ కింద చేస్తున్నామన్నారు. ఈ కేసులకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. కరీంనగర్ జిల్లా పెద్దపల్లికి చెందిన ఇషయ్య(42) తీవ్రంగా చెవినొప్పితో బాధపడుతూ హైదరాబాద్ కింగ్‌కోఠీ ఈఎన్‌టీ దవాఖానకు వెళ్లి అక్కడ నుంచి మహబూబ్‌నగర్ జనరల్ దవాఖానకు వచ్చాడు. ఇక్కడ ఈఎన్‌టీ విభాగాధిపతి సంపత్ కుమార్ సింగ్‌ను సంప్రదించగా.. రోగిని పరీక్షించి చెవి వెనుకాల ఎముక భాగంలో ఇన్ ఫెక్షన్ ఏర్పడి బ్రెయిన్ వరకు వ్యాప్తి చెందిందని గుర్తించి ఈనెల 12న ఆరు గంటలపాటు సంపత్ కుమార్ సింగ్ నేతృత్వంలో సబ్‌టోంటల్ పెట్రోస్కాటామీ శస్త్రచికిత్సను చేశారు. ఈ సర్జరీలో వైద్యులు ఆసోసియేట్ ప్రొఫెసర్ శ్రీకాంత్, వైష్ణవి, డా.రమేశ్, ఓటీ ఇన్‌చార్జి నర్సులు, జనరల్ సర్జరీ విభాగాధిపతి సునీల్‌కుమార్ నేతృత్వంలో జిల్లాకు చెందిన కోటకదిరకు చెందిన లక్ష్మమ్మ (45)కు కడుపునొప్పితో బాధపడగా.. జనరల్ సర్జరీ విభాగంలో అడ్మిట్ చేసి ఆమెకు తగిన పరీక్షలు నిర్వహించి 12న శస్త్రచికిత్స చేసి 3 కిలోల కణతిని తొలగించారు. ఇలాంటి ఎన్నో ఆధునాతన వైద్య సేవలు ప్రభుత్వ దవాఖానలో ఉచితంగా అందుబాటులో ఉన్నాయని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. శస్త్రచికిత్సలో వైద్యబృందం మాధవి, గాయిత్రి, రహీం, జగన్, వంశీ, సాయిచరణ్, విజేత ఉన్నారు.

వేరుశనగ@రూ.6,959

జడ్చర్ల, మార్చి 17: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం వేరుశనగకు అత్యధికంగా క్వింటాకు రూ.6959 ధర పలికింది. సోమవారం బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌కు వేరుశనగ, కందులు, మినుములు, మొక్కజొన్న, పెబ్బర్లు, జొన్నలు, అమ్మకానికి వచ్చాయి. అదేవిధంగా 939క్వింటాళ్ల వేరుశనగ అమ్మకానికి రాగా.. క్వింటాకు గరిష్ఠంగా రూ.6,959ధర రాగా కనిష్ఠంగా రూ.5,311, మధ్యస్తంగా రూ.6,849ధర పలికింది. మార్కెట్‌కు 79 క్వింటాళ్ల కందులు అమ్మకానికి రాగా దానికి క్వింటాకు గరిష్ఠంగా రూ.6,925, కనిష్ఠంగా రూ.5,200, మధ్యస్తంగా రూ.6,515 పలికింది. అదేవిధంగా మార్కెట్‌కు 81క్వింటాళ్ల ఆముదాలు అమ్మకానికి రాగా దానికి క్వింటాకు గరిష్ఠంగా రూ.6,160 పలికింది. 12క్వింటాళ్ల మినుములు రాగా దానికి క్వింటాకు గరిష్ఠంగా రూ.7,171 పలికింది. అదేవిధంగా మార్కెట్‌కు 5క్వింటాళ్ల పెబ్బర్లు అమ్మకానికి రాగా దానికి క్వింటాకు గరిష్ఠంగా రూ.5,771ధర పలికింది. అదేవిధంగా మార్కెట్‌కు 455క్వింటాళ్ల మొక్కజొన్నలు అమ్మకానికి రాగా దానికి క్వింటాకు గరిష్ఠంగా రూ.2,329 పలికింది. 23 క్వింటాళ్ల జొన్నలు రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ.4,377ధర పలికింది.

బహిరంగ ప్రకటన
తేది:17-03-2025
ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయడమేమనగా నా క్లయింటు అయిన శ్రీమతి కె.సాలి భర్త కాట్రావత్ శ్రీను నాయక్, నివాసము పెద్ద తాండ, బార్గుపల్లి గ్రామము జడ్చర్ల మండలము, మహబూబ్‌నగర్ జిల్లా గారి తరపున జారీ చేయు బహిరంగ ప్రకటన ఏమనగా మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలము మామారం గ్రామ శివారులోని సర్వే నం.126,126/ఎ యందలి ప్లాట్ నం.21, విస్తీర్ణము 200.00 చదరపు గజములు గల ప్లాటుకు నా క్లయింటు యజమాని. పై కనపరచిన ప్లాటుకు సంబంధించిన లింకు దస్తావేజు నం.8939/2006 S.R.O జడ్చర్ల ప్రస్తుతము నా క్లయింటు ఆధీనములో లేదు. పై కనపరచిన లింకు డాక్యుమెంటుకు సంబంధించి ఎవరికైనా ఏలాంటి అభ్యంతరాలు, అధికారములు, హక్కులు, ఆక్షేపణలు ఉన్న యెడల ఈ ప్రకటన వెలుబడిన నాటి నుండి (5) రోజులోపు తమ ఆక్షేపణలను క్రింద కనబరచిన చిరునామాకు తెలుపగలరని ఇట్టి బహిరంగ ప్రకటన ద్వారా తెలియజేయనైనది .
ప్లాటుకు హద్దులు :- తూర్పు : 25 ఫీట్ల వెడల్పు రోడ్డు, పడమర : ప్లాటు నెం.25, ఉత్తరం : ప్లాటు నెం.20, దక్షిణము : ప్లాటు నెం.22.
GOPAL JHAWAR, Advocate
30-141, Venkateshwara Colony, Jadcherla-509301, Mahabubnagar Dist.
Cell : 9291211196

'ఉపాధి' సమస్యలు పరిష్కరించాలి

నారాయణపేట, మార్చి 17: ఉపాధి హామీ పథకంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకట్రాములు, జిల్లా కార్యదర్శి గోపాల్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని కలెక్టరేట్ వద్ద డీఆర్డీవో మొగులప్పకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో మొక్కల పెంపకంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న వాచర్స్, నర్సరీల్లో పని చేస్తున్న వనసేవకులకు రోజువారీ వేతనం రూ.600 ఇవ్వాలన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేయాలన్న కుట్రలో భాగంగా నిధులు తగ్గిస్తూ వస్తుందన్నారు. వేసవిలో ఎండలు తీవ్రతరం అవుతున్నాయని, పని ప్రదేశాల్లో నీడకోసం టెంట్లు, మంచినీళ్లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బాలప్ప, శివకుమార్, భీంషప్ప, మొగులప్ప, భాస్కర్, అశోక్, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

బాధితకుటుంబానికి ఆర్థిక సాయం

ఆర్థిక సాయం అందజేస్తున్న రాజశేఖర్‌రెడ్డి

మూసాపేట, మార్చి 17: అడ్డాకుల మండలంలోని పొన్నకల్ గ్రామానికి చెందిన సత్యంయాదవ్ చెట్టు పైనుంచి పడి తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లోని యశోద దవాఖానలో చికిత్స పొందుతూన్నాడు. విషయం తెలిసిన మాజీ జెడ్పీటీసీ రాజశేఖర్ రెడ్డి సోమవారం సత్యం కుటుంబానికి రూ.20వేల ఆర్థిక సాయం అందించారు.

బాల్య వివాహాలపై అవగాహన

కృష్ణ, మార్చి 17: మండలంలోని కుసుమూర్తిలో మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ నర్సింహులు ఆధ్వర్యంలో సోమవారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ అమ్మాయిలను చదువుకునే విధంగా చూడాలని జెండర్ స్పెషలిస్ట్ నర్సింహులు అన్నారు. విద్యకోసం ప్రభుత్వం సౌకర్యాలు కల్పిస్తున్నాయని, పిల్లల కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1098పనిచేస్తుందని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడుతాయన్నారు. జెండర్ స్పెషలిస్ట్ అనిత మాట్లాడుతూ.. ప్రతి అమ్మాయి చదువుకుని తన కాళ్లపై తాను నిలబడాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు, జెండర్ స్పెషలిస్ట్ అనిత, శంకరప్ప, దేవేంద్రప్ప పాల్గొన్నారు.

అక్రమ వ్యాపారాలను అరికట్టాలి

- కలెక్టర్‌కు బీఆర్ఎస్ నాయకుల ఫిర్యాదు

మహ్మదాబాద్/గండీడ్, మార్చి 17: ఉమ్మడి గండీడ్ మండలంలో చేపడుతున్న అక్రమ వ్యాపారాలను అరికట్టాలని ఉమ్మడి మండల బీఆర్ఎస్ నాయకులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ విజయేందిరబోయికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. ఉమ్మడి గండీడ్, మహ్మదాబాద్ మండలాల్లో రంగారెడ్డిపల్లి, ధర్మాపూర్ వాగుల నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్నా.. రెవెన్యూ, పోలీసు అధికారులు చూసీచూడనట్లు ఒక వర్గానికి మద్దతు ఇస్తున్నారని పేర్కొన్నారు. సీసీరోడ్లకు కలెక్టర్ ఇసుక తరలింపునకు కలెక్టర్ అనుమతులు ఇచ్చారనే సాకుతో ప్రభుత్వానికి కట్టాల్సిన డీడీలు ఒక్కో గ్రామానికి 5 ట్రిప్పులకు డీడీలు కట్టి ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పర్మిషన్ ఉండగా.. రాత్రిపగలు తేడా లేకుండా అక్రమంగా రవాణా చేస్తున్నారని వివరించారు. స్థానిక ఎస్సైని అడిగితే తనకేమీ సంబంధం లేదని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయాలని చెబుతున్నారని పేర్కొన్నారు. కంచన్‌పల్లి అయప్ప గుట్ట నుంచి రియల్ ఎస్టేట్ వ్యాపారులకు వందల ట్రిప్పుల మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గ్రామానికో ఏజెంట్‌ను పెట్టి వారితో డబ్బులు తీసుకుని ఇతర ప్రాంతాలకు రేషన్‌బియ్యం ఎగుమతి చేస్తున్నారని ఇలాంటి అక్రమ వ్యాపారాలకు అడ్డుకట్ట వేయాలని కలెక్టరుకు ఫిర్యాదు చేసినట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచులు వెంకట్‌రాంరెడ్డి, నీలేశ్, గోపాల్, రాములు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెంట్యానాయక్, నాయకులు రాజ్‌కుమార్ రెడ్డి, నర్సప్ప, రాంచంద్రా రెడ్డి, రాంరెడ్డి, ఉమ్మడి మండల నాయకులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఈశ్రమ్ కార్డులపై అవగాహన

నవాబ్‌పేట, మార్చి 17: మండలంలోని యన్మన్‌గండ్లలో ఈశ్రమ్ కార్డుల జారీ, సామాజిక భద్రత, బాల కార్మికుల చట్టాలపై ఆశ్రయ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో పనిచేసే కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ శ్రమ్ కార్డు పొందినట్లయితే ఏదైనా ప్రమాదం సంభవిస్తే కార్మికుడి కుటుంబానికి రూ.2ల క్షల బీమా లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆశ్రయ్ సంస్థ జిల్లా అధికారి ప్రవీణ్, అంజద్, హరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యసాధనకు కృషి చేయాలి

మరికల్, మార్చి 17: పదో తరగతి విద్యార్థులు లక్ష్యసాధనకు కృషిచేయాలని విశ్రాంత ఉపాధ్యాయుడు సుదర్శన్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల వార్షికోత్సవంలో పాల్గొని మాట్లాడారు. పరీక్షల సమయంలో విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని, చదువుపై శ్రద్ధ కనబరచాలన్నారు.

ఐదుగురిపై కేసు నమోదు

భూత్పూర్, మార్చి17: పట్టణ పరిధిలోని రాందాస్‌తండాలో ఇసుక అక్రమ తరలింపు జరుగుతుందని ఫిర్యాదుల మేరకు సోమవారం పోలీసులు తండాకు వెళ్లారు. దీంతో తండాలో జేసీబీ శ్రీనునాయక్‌ను పోలీసులు పట్టుకున్నారు. అనంతరం ఠాణాకు తరలిస్తుండంతో కొందరు తండావాసులు పోలీసులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులు, తండావాసులకు వాగ్వాదం చోటుచేసుకున్నది. ఈ విషయం తెలుకున్న తండాకు చెందిన మాజీ కౌన్సిలర్ బాలకోటి, బీఆర్ఎస్ నాయకులతో కలిసి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. ఎస్సైతో మావాడిని ఎందుకు కొట్టారని అడగడంతో పోలీసులతో గొడవ జరిగింది. గొడవ తగ్గాలనే ఉద్దేశంతో మారో మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి బాలకోటిని బయటకు వెళ్లమని పంపించారు. దీంతో ఎస్సై మాజీ కౌన్సిలర్ బాలకోటి, శ్రీనివాస్ రెడ్డిపై నాన్ బెయిలబుల్, ఇసుక వ్యాపారి జేసీబీ శ్రీనునాయక్, తండాలో పోలీసులను అడ్డుకునేందుకు యత్నించిన మరో ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు సమాచారం.

మెనూ ప్రకారం భోజనం ఇవ్వాలి

నారాయణపేట, మార్చి 17: చిల్డ్రన్ హోంలో చిన్నారులకు ప్రభుత్వం అందించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం ఇవ్వాలని సీనియర్ సివిల్ జడ్జి వింధ్యానాయక్ అన్నారు. సోమవారం పట్టణంలోని బారంబావి సమీపంలోని చిల్డ్రన్ హోంను ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిల్డ్రన్ హోంలో చిన్నారులకు అందుతున్న వసతులు, రిజిస్టర్లు, పరిసరాలు, ఆహార సరుకులు, సీసీ కెమెరాలు తదితర వాటిని పరిశీలించారు. 24గంటలపాటు అందుబాటులో ఉంటూ ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలన్నారు.

సంఘాల ఏర్పాటుపై సమీక్ష

ఆర్గనైజర్లు, ఆర్పీలతో మెప్మా రాష్ట్ర మిషన్ కోఆర్డినేటర్ సుజాత

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, మార్చి 17: మెప్మా రాష్ట్ర మిషన్ కోఆర్డినేటర్ సుజాత సోమవారం మహబూబ్‌నగర్ నగర పాలక సంస్థ, మెప్మా కార్యాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా కొత్త సంఘాల ఏర్పాటు, బ్యాంకు లింకేజీ రుణాలు, మహిళల ఆర్థిక స్వావలంబన తదితర అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో డీఎంసీ లక్ష్మీ, కమిటీ ఆర్గనైజర్లు, ఆర్పీలు పాల్గొన్నారు.

దాడి కేసులో వ్యక్తికి రిమాండ్

ఊట్కూర్, మార్చి17: విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్ పై దాడికి పాల్పడిన వ్యక్తిని సోమవారం రిమాండ్ కు తరలించినట్లు ఎస్సై కృష్ణంరాజు తెలిపారు. వివరాలు ఇలా.. మండల శివారులోని వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఈ నెల 5న కానిస్టేబుల్ పట్టుకోగా ట్రాక్టర్ యాజమని చాకలి శ్రీను కానిస్టేబుల్ పై దాడికి పాల్పడి ట్రాక్టర్‌ను తీసుకువెళ్లాడు. ఘటనపై కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

బొటానికల్ గార్డెన్ సందర్శన

బొటానికల్ గార్డెన్‌లో విద్యార్థులు

జడ్చర్ల, మార్చి 17: జడ్చర్లలోని డాక్టర్.బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని బొటానికల్ గార్డెన్‌ను అలంపూర్ విశ్వశాంతి డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు సోమవారం సందర్శించారు. కళాశాలకు చెందిన బోటనీ అధ్యాపకురాలు శశికళ ఆధ్వర్యంలో 30మంది విద్యార్థులు బొటానికల్ గార్డెన్‌ను సందర్శించి అక్కడున్న వివిధ రకాల చెట్లను పరిశీలించారు. అదేవిధంగా గార్డెన్‌లోని ఔషధ మొక్కలు, అంతరించి పోతున్న అరుదైన మొక్కలను గార్డెన్ సమన్వయకర్త సదాశివయ్య చూపించారు. అదేవిధంగా గార్డెన్‌ను అనుసంధానంగా ఉన్న జీవవైవిధ్య పరిశోధన, విద్యా కేంద్రాన్ని సందర్శించిట్లు సదాశివయ్య తెలిపారు.

విద్యుత్ తీగలు తాకి జొన్నచొప్ప దగ్ధం

మద్దూర్ (కొత్తపల్లి), మార్చి17: విద్యుత్ తీగలు తాకి లారీలో తరలిస్తున్న జొన్న చొప్ప దగ్ధమైన ఘటన మద్దూర్ మండలంలో చోటుచేసుకున్నది. మండలంలోని దోరేపల్లి శివారులోని బొడ్డు బావి వద్ద గ్రామానికి చెందిన రైతుల వద్ద జొన్న చొప్పను కొనుగోలు చేసి హైదరాబాద్ లారీలో తరలిస్తుండగా.. విద్యుత్ తీగలు లారీకి తాకడంతో నిప్పురవ్వలు వచ్చి చొప్పదగ్ధమైంది. స్థానికులు ఫైరింజన్‌కు ఫోన్ చేయగా సమయానికి ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. చొప్ప మొత్తం అంటుకోగా లారీకి పెద్దగా నష్టం జరగలేదని స్థానికులు తెలిపారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి..

మాగనూరు, మార్చి 17: జీపీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ.. సోమవారం ఎంపీడీవో రహిమ తబ్దీన్‌కు సీఐటీయూ జిల్లా నాయకుడు ఏజీ భుటో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పంచాయతీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యూటీ, ఇన్సూరెన్స్ అమలు చేయాలన్నారు. జీవో 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలని ప్రభుతాన్ని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఏజీ భుటో, నాయకులు, ఆశప్ప, రాకేశ్, మారెప్ప, నర్సింహ పాల్గొన్నారు.

'ఆశ'లకు కనీస వేతనం అమలు చేయాలి

నారాయణపేట, మార్చి 17: ఆశ కార్యకర్తలకు కనీస వేతనం రూ.18వేలు నిర్ణయించి అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రాం, ఆశ కార్యకర్తల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బాలమణి డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని తాసీల్దార్ కార్యాలయం ఎదుట ఆశ కార్యకర్తలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పారితోషికం పేరుతో ఆశ కార్యకర్తలతో వెట్టి చేయిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పారితోషికానికి పొంతన లేని పనులు అప్పచెబుతున్నారని ఆరోపించారు. ఏఎన్ఎం శిక్షణ పూర్తి చేసిన ఆశలకు ఏఎన్ఎం పోస్టులు ఇవ్వాలని, ప్రతి ఆదివారం, పండుగ సెలవులు ఇవ్వాలన్నారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే కనీస వేతనం అమలు పర్చాలని డిమాండ్ చేశారు. అంతకుముందు అర్బన్ హెల్త్ సెంటర్ నుంచి తాసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీటీ రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆశ యూనియన్ నాయకులు రాధిక, నర్మద, నాగమణి, లక్ష్మి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

పేట: సీనియర్ అసిస్టెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశ కార్యకర్తలు

సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి..

మక్తల్, మార్చి 17: ప్రభుత్వ సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న ఆశా వర్కర్లకు సమానపనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో తాసీల్దార్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి గోవిందరాజు , నాయకురాలు గోవిందమ్మ, అమీనా బేగం, యశోధ, ఇందిరా, అనిత, పార్వతమ్మ, వెంకటలక్ష్మి, వెంకటమ్మ, సుజాత, లక్ష్మి తదితరులు ఉన్నారు.

మక్తల్ తాసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశ కార్యకర్తలు

ఊట్కూర్ మండలంలో..

ఊట్కూర్, మార్చి17: ఆశ కార్యకర్తలకు కనీస వేతనం రూ.18వేలు అమలు చేయాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు నారాయణ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆశ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సీనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నరహరి, ఆశా నాయకురాలు బాలమణి, శివమ్మ, పద్మమ్మ, సాబెరా, జైనాబీ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన
ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, Kale Venkatesh S/o Kale Pedda Rangaiah, aged 38 years, Occ:Business,R/o H.No.3-77, Palakonda, Mahabubnagar Rural Mandal & Dist,. **Applicant / Borrower,** Smt. Kale Aruna W/o Kale Rangaiah, aged 40 years, Occ: House hold, H.No.3-77/2, Palakonda, Mahabubnagar Rural Mandal & Dist,. **Co-applicant/ Joint Property